క్లుప్తంగా

నిరాడంబరతకు నిదర్శనం డాక్టర్ అరుణకుమారి



సత్తెనపల్లి: నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం డాక్టర్ పొట్ల అరుణకుమారి అని ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, రొటేరియన్ పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ అన్నారు. సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా డాక్టర్ అరుణకుమారిని నియమించిన సందర్భంగా సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో చిరుసత్కారం చేశారు. కార్యక్రమంలో పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, ధర్మపత్ని భారతి, పోతుగంటి నరసింహారావు, దివ్వెల శ్రీనివాసరావు, అప్పాపురపు నరేంద్ర తదితరులు ఉన్నారు.

పరిమితికి మించి జనాన్ని ఎక్కిస్తే వాహనాలు సీజ్

ఎస్ఐ వేణుగోపాల్



రాజుపాలెం: గుంటూరు–మాచర్ల రహదారిపై పరిమితికి మించి జనాలను, కూలీలను ఎక్కించుకున్న టాటా ఏస్‌లు, ఆటోలను ఆపి ఎస్ఐ వేణుగోపాల్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం ముప్పాళ్ల మండలంలో చాగంటివారిపాలెం వద్ద కూలీల ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు మృతి చెందగా కొంత మందికి గాయాలు కావడంతో పోలీసు శాఖ ముమ్మరంగా తనిఖీలు చేపట్టింది. మండలంలో సుదీర్ఘ ప్రాంతాలు, పక్క మండలాల నుంచి వందల సంఖ్యలో కూలీలు మిరపకాయల కోతకు ఆటోలు ఇతర వాహనాలలో పరిమితికి మించి రావడంతో తనిఖీలు చేపట్టారు. కొన్ని ఆటోలకు ఎక్కువ మంది కూలీలు ఉండడంతో అపరాధ రుసుము చెల్లించాలని ఎస్ఐ తెలిపారు. చెల్లించే వరకు ఆటోలను పోలీసు స్టేషన్‌లో ఉంచాలని చెప్పారు.

మద్యం షాపుల లాటరీ ప్రక్రియ వాయిదా

సీఐ విజయ్‌కుమార్



సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం షాపుల లాటరీ ప్రక్రియ వాయిదా వేయడం జరిగిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం గీత కులాలకు సంబంధించిన మద్యం షాపులకు నిర్వహించవలసిన లాటరీ ప్రక్రియ వాయిదా వేయడమైందన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తదుపరి లాటరీ జరుగు తేది ప్రకటించ బడుతుందన్నారు. మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వారు మంగళవారం లాటరీ ప్రక్రియకు హాజరు కానవసరం లేదన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి



సత్తెనపల్లి: గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. సత్తెనపల్లి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి సమీపంలోని 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఆ వృద్ధుడిని 108 వాహనంలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సమాచారం తెలియకపోవడంతో ఎవరైనా గుర్తిస్తే సత్తెనపల్లి రూరల్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

అలరించిన సంగీత కచేరి



అమరావతి: స్థానిక యోగాశ్రమంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాల మూడవరోజు సోమవారం ముగింపు కార్యక్రమంలో విజయవాడకు చెందిన గండూరి నాగేశ్వరశర్మ బృందం సంగీత కచేరి సంగీత ప్రియులను అలరించింది. సాయంత్రం ఆరు గంటలకు సంగీత విద్వాంసులు గండూరి నాగేశ్వరశర్మ ఆలపించిన కీర్తనలు, భక్తిగీతాలకు వారు బీవీఎస్ కృష్ణ సహకార గానం అందించగా గండూరి శ్రీనివాసమూర్తి, వయొలిన్, సీహెచ్ సూర్య మృదంగ సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ధాన్యకటక బుద్ధ విహార ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావులతో పాటు పుర ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మించండి.. ప్రాణాలు కాపాడండి

- సరైన స్థానంలో నిర్మాణంతో ప్రమాదాలకు, ట్రాఫిక్ సమస్యకు చెక్
- హైవేపై రోడ్డు దాటే క్రమంలో ప్రాణాలకు ముప్పు
- పట్టించుకోని హైవే అధికారులు



అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న, అండర్ పాస్ నిర్మాణం కోరుతున్న ప్రాంతం

నకరికల్లు: హైవేలపై ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరుగుతున్నా.. కారణం కనుగొని సమస్యను పరిష్కారం చేసే వైపు హైవే అధికారులు దృష్టి పెట్టడం లేదు. ప్రమాదం జరిగిన రోడ్డు సర్వీస్ రోడ్డు గుండా బస్సులు నడపాలి.. హైవేపై ఎవరూ నడవకుండా నిబంధన పెట్టారు.. అన్న చర్చ ప్రమాదం జరిగిన ఒక్కరోజు సాగుతుంది. మరుసటి రోజు నుంచి ఆ సమస్యపై దృష్టి పెట్టేవారే ఉండరు. మళ్లీ ప్రమాదం జరిగితే ఆ రోజు వరకు చర్చ.. ఇదీ తరచూ జరుగుతున్న తంతు.

ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి

అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి నకరికల్లు గ్రామం మధ్యగా వెళ్తుంది. ఏ చిన్నపాటి అవసరమున్నా.. రోడ్డుకు అటువైపు వారు ఇటు.. ఇటువైపు వారు అటు రోడ్డు దాటాల్సిన పరిస్థితి. ప్రయాణికులు బస్సులు ఎక్కి దిగేది కూడా హైవే రోడ్డు పైనే. ఈ క్రమంలో హైవేపై వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.

నిరుపయోగంగా అండర్ పాస్

నకరికల్లు గ్రామంలో నిర్మించిన అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి కిందుగా ఆంధ్రా బ్యాంకు బజార్‌కు సమీపంలో అండర్ పాస్ నిర్మించారు. గ్రామంలోని రాకపోకలకు దూరంగా అండర్ పాస్ ఉండడంతో ఒక్క వాహనదారులు తప్ప పాదచారులు వినియోగించే పరిస్థితి లేదు. గ్రామమంతా పాతూరు రోడ్డు, బ్యాంకు బజారు ప్రాంతాల్లో ఉండడంతో రోడ్డు దాటే వారు అండర్‌పాస్ వరకూ వెళ్లకుండా హైవే పైనే నడిచి వెళ్తూ ఉంటారు. ఈ క్రమంలోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎన్నిసార్లు ప్రమాదాలు జరిగినా ప్రమాదాలు శాశ్వతంగా అరికట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

కొత్త అండర్‌పాస్ నిర్మించాలి

నకరికల్లు గ్రామంలో ఎక్కువగా పాతూరు రోడ్డు వైపు, బ్యాంకు బజారు వైపు 90 శాతం మంది ప్రజలు హైవే రోడ్డు దాటుతుంటారు. నిత్యావసరాలకు మొదలు బ్యాంకులు, పోస్టాఫీసు, మెడికల్ షాపులకు, నరసరావుపేట వైపు, పిడుగురాళ్ల, మాచర్ల వైపు రాకపోకలకు హైవే దాటడం తప్పనిసరైంది. ప్రస్తుతం ఉన్న అండర్‌పాస్ దూరంగా ఉండడంతో హైవేపై నుంచే నడుచుకుంటూ రోడ్డు దాటుతారు. ఈ క్రమంలో జరుగుతున్న ప్రమాదాలు అన్నీ ఇన్నీ కావు. ఇంత ప్రాణనష్టం సంభవించడం, గాయాలపాలవడం జరుగుతున్నా రోడ్డు రవాణా శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజలకు అవసరమైన ప్రాంతంలో అంటే పాతూరు రోడ్డు, బ్యాంకు బజారు రోడ్డు కలిసే చోట అండర్‌పాస్ నిర్మిస్తే శాశ్వతంగా ప్రమాదాల సమస్య పరిష్కారం అవుతుంది. ట్రాఫిక్ సమస్య కూడా తీరుతుంది.

రోడ్డు దాటాలంటే భయంగా ఉంది

మేము హైవేకు ఇవతల వైపున ఉన్న వీధిలో ఉంటాం. బ్యాంకు, కూరగాయల దుకాణాలు రోడ్డుకు అవతల వైపున ఉంటాయి. హైవే అవతలకు వెళ్లాలంటే ప్రస్తుతం ఉన్న అండర్‌పాస్ కిందుగా వెళ్లాలంటే దూరమని రోడ్డు దాటి వెళ్తుంటాం. స్పీడుగా వచ్చే లారీలు, కార్లతో రోడ్డు దాటాలంటే భయంగా ఉంటుంది. కానీ చుట్టూ తిరిగే పనుండదని రోడ్డు దాటుతాం. అండర్‌పాస్ సెంటర్‌లో ఉంటే మాలాంటి వాళ్లకి ఇబ్బంది ఉండదు.

– బి.వెంకటేశ్వరమ్మ, నకరికల్లు

యాక్సిడెంట్‌లు జరుగుతున్నాయి

మా ఊళ్లోని హైవే రోడ్డు మీద యాక్సిడెంట్‌లు జరుగుతూనే ఉన్నాయి. బస్సు దిగి ఇంటికి రావాలంటే రోడ్డు దాటితే దగ్గరని అందరూ రోడ్డు దాటుతుంటారు. రోడ్డు దాటేటపుడు లారీలు, కార్లు తగిలి కొందరు చనిపోయారు. చాలా మందికి దెబ్బలు తగిలాయి. అండర్ పాస్ ఊరికి సెంటర్‌లో పాతూరు రోడ్డు దగ్గర ఉంటే ఇక రోడ్డెక్కే పని ఉండదు. ప్రమాదాలు జరగవు, ప్రాణాలు పోవు.

– ఎస్.కోటయ్య, నకరికల్లు

చాగంటివారిపాలెంలో విషాదఛాయలు



మధిర గంగమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో మృతుల కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన మధిర సాంబ్రాజ్యం, చక్కెర మాధవి, మధిర గంగమ్మ, తేలేపల్లి పద్మలు ఆదివారం మిరపకాయ కోతలకు వెళ్లి ఇంటికి వస్తూ బొల్లవరం సమీపంలోని మేజర్ కాల్వకట్టపై ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రమాదం అనంతరం వివరాలు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గ్రామానికి చేరిన మృతదేహాలను చూసిన కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు కావటం, ఒకే ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడటంతో గ్రామంలోని ప్రతి ఒక్కరి కళ్లలో కన్నీటి ధారలే కనిపించాయి. పైగా మృతుల్లో ముగ్గురు సమీప బంధువులు కూడా కావటంతో వారి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో గ్రామం కన్నీటి సంద్రమయింది.



మాధవి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి

మట్టి ఖర్చులు అందజేత

ప్రమాదంలో నలుగురు వ్యవసాయ మహిళా కూలీల మృతి వార్త తెలుసుకున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి సోమవారం గ్రామానికి చేరి మృతదేహాలకు నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తక్షణ ప్రభుత్వ సాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు అందించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందేలా చూస్తామని కుటుంబసభ్యులకు చెప్పారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



మాధవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కన్నా సానుభూతి

ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన నలుగురు వ్యవసాయ కూలీల మృతదేహాలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం సందర్శించి నివాళులర్పించారు. వ్యవసాయకూలీలుగా జీవనం సాగిస్తూ పొలం పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో ప్రాణాలు కోల్పోవటం బాధాకరమన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబసభ్యులను ఓదార్చి ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని చెప్పారు. తన వంతుగా ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు మధిర రామ్మోహనరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కళ్లం వీరభాస్కరరెడ్డి, రావిపాటి మధుబాబు తదితరులు ఉన్నారు.

నేడు శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యల కల్యాణ మహోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వారి 31వ వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం జరగనుందని నిర్వాహకులు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10:44 గంటలకు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, కాకాని గోపయ్య స్వామిల కల్యాణం జరుగుతుందన్నారు. కల్యాణం అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 12న బుధవారం ఉదయం 8:30 గంటలకు ఉత్సవమూర్తుల ఊరేగింపు, సాయంత్రం 6 గంటలకు జలబిందెల కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముప్పాళ్ళ: మండలంలోని మాదల గ్రామంలో గల శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి దేవస్థానంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యల కల్యాణ మహోత్సవం ఈ నెల 11వ తేదీన జరుగుతుందని ఆలయ ధర్మకర్త చిమటా పోలురాజు సోమవారం తెలిపారు. కల్యాణంలో పాల్గొనే వారు ముందస్తుగా సమాచారం అందించాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో తిరునాళ్లను జయప్రదం చేయాలి

తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసయాదవ్

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో ఈ నెల 12న జరిగే గంగాదేవి పేరంటాళమ్మ తల్లి తిరునాళ్లను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో జయప్రదం చేయాలని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ కోరారు. మండలంలోని ఓర్వకల్లు గంగమ్మతల్లి దేవాలయంలో సోమవారం దేవదాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, హెల్త్, ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని సైడు కాలువల్లో బ్లీచింగ్ చల్లించాలని, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని, పంచాయతీరాజ్ శాఖకు సూచించారు. దూర ప్రాంతాల భక్తుల రాకపోకలకు అంతరాయం కలుగకుండా క్రోసూరు, అచ్చంపేట, అమరావతి మండలాల నుంచి ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు అందించాలని పీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సీఐ వెంకటప్రసాద్‌ను కోరారు. దేవాలయం వద్ద విద్యుత్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు గమనించే విధంగా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి గంగమ్మతల్లి తిరునాళ్లను విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, సీఐ వెంకటప్రసాద్, ఈవో ఎం.కోటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చిలుకూరు ఆలయ అర్చకుడిపై దాడిని ఖండించిన బ్రాహ్మణ సంఘాలు

అమరావతి: తెలంగాణాలో ప్రముఖ క్షేత్రం చిలుకూరు ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని సోమవారం పలు బ్రాహ్మణ సంఘాలు, విశ్వహిందూ పరిషత్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించాయి. బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కౌశిక ప్రసాద్ మాట్లాడుతూ దేవాలయ వ్యవస్థపై అర్చక స్వాములపై దాడి యావత్ హిందూ సమాజంపై జరిగినట్టుగా భావించి తెలంగాణ ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. గుంటూరు జిల్లా విశ్వహిందూ పరిషత్ నాయకుడు కోలా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రంగరాజన్‌పై దాడి చేసిన సంఘ విద్రోహ శక్తులను తక్షణమే శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆదిత్య బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

తెలంగాణాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం చిలుకూరు దేవస్థానం ప్రధానార్చకులు రంగరాజన్‌పై రామరాజ్యం అనే పేరుతో వచ్చిన దుండగులు దాడి చేయడం అమానుషమని సత్తెనపల్లి డివిజన్ బ్రాహ్మణ ఐక్యవేదిక సలహాదారులు ఆగమ పండితులు పులుపుల వేంకట ఫణికుమార శర్మ అన్నారు. సోమవారం ఒక ప్రకటనలో అర్చకుల మీద జరిగే దాడి యావత్ హిందూ సమాజంపైన, సనాతన ధర్మం మీద జరిగే దాడిగా గమనించాలన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పటిష్టమైన చట్టాలను తీసుకువచ్చి దేవాలయ వ్యవస్థకు, అర్చకులకు రక్షణ కల్పించాలన్నారు.

మాల మహానాడు మండల అధ్యక్షుడిగా జెల్ది నరసింహారావు



నియామక పత్రం అందుకుంటున్న నరసింహారావు

క్రోసూరు : క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన జెల్ది నరసింహారావు మాల మహానాడు క్రోసూరు మండలం అధ్యక్షుడిగా నియమించబడ్డారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదాజాన్‌పాల్ నరసింహారావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాల మహానాడు సంఘం అభివృద్ధికి, దళిత వర్గాల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మాల మహానాడు నాయకులు, నియోజకవర్గ నాయకుడు జెర్రిపోతు చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఓర్వకల్లు గంగమ్మతల్లి తిరునాళ్ల

అచ్చంపేట : మండలంలోని ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగాదేవి పేరంటాళ్లమ్మ తిరునాళ్లను ఈ నెల 12న బుధవారం నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ప్రతి యేటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారి తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఓర్వకల్లు, రుద్రవరం, గ్రంధశిరి గ్రామాలలో అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు జరుగుతాయి. అమ్మవారిని కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా, పాడిపంటలు ఇచ్చే అమ్మగా, సంతాన లక్ష్మిగా ఈ ప్రాంత ప్రజలు కొలుస్తారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నెలకొల్పారు. దూరప్రాంతం నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ



రాజుపాలెం కేజీబీవీలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న అధికారులు



నకరికల్లులో విద్యార్థిచే మాత్ర మింగిస్తున్న హెచ్‌ఎం నగేష్, డీఎల్‌పీఓ రాజగోపాల్, అధికారులు

నకరికల్లు: విద్యార్థులు చిన్న నాటి నుంచే ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి రాజగోపాల్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్ర మింగడం ద్వారా అనారోగ్య సమస్యలను అరికట్టవచ్చన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ మణికంఠ మాట్లాడుతూ పొట్టలో నులిపురుగులు ఉండడం వలన ఆకలి మందగించడం, విరేచన సమస్యలు, రక్తహీనత తదితర సమస్యలు వస్తాయన్నారు. ప్రతి విద్యార్థి వయస్సును బట్టి ఇచ్చిన మోతాదులో మాత్రలు మింగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.కాశయ్య, ఎంఈఓ–2 ఎంఎల్ఎస్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు కె.నగేష్, పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

92 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు

రాజుపాలెం: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను సోమవారం వేశారు. మండలంలోని కేజీబీవీలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ కృష్ణకుమార్ నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థినులకు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ రెండేళ్ల నిండి 18 ఏళ్ల లోపు పిల్లలు 8,950 మందికి గాను 8,250 మందికి మాత్రలు వేశామని, 92 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 17న ఇస్తామని తెలిపారు. రెడ్డిగూడెం ఉర్దూ పాఠశాలలో డాక్టర్ రవితేజనాయక్ పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంఈవో–1, 2 మల్లిఖార్జునశర్మ, నరసింహారావులు, హెచ్‌ఎం జోతిర్మయి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు పాల్గొన్నారు.

12 వేల మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలు పంపిణీ

అమరావతి: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా 12 వేల మందికి నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశామని అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ తెలిపారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 13,000 మంది 3 నుంచి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఉండగా సోమవారం సాయంత్రానికి 12 వేల మందికి నులిపురుగుల మందులు పంపిణీ పూర్తి చేశామన్నారు. మిగిలిన వారికి కూడా ఈ నెల 17న పంపిణీ చేసి నూటికి నూరుశాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

96 శాతం మందికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

క్రోసూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లల చేత చప్పరించటం, మింగించటం 96 శాతం పూర్తి చేసినట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ధనుష్ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులతో మాత్రలు మింగించటం జరిగిందన్నారు. 14,642 మందికి గాను 14,102 మంది చిన్నారులకు మాత్రలు వేయటం జరిగిందన్నారు. మిగిలిపోయిన వారికి ఈ నెల 17న వేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

5,042 మంది పిల్లలకు నులి పురుగుల మందులు

బెల్లంకొండ: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం 5,042 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశామని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 5,592 మంది పిల్లలు ఉండగా సోమవారం సాయంత్రానికి 5,042 మందికి పంపిణీ పూర్తి చేశామన్నారు. మిగిలిన వారికి ఈ నెల 17న పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నులిపురుగుల మాత్రలను వేస్తున్న అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్



నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు

నియోజకవర్గంలో 7,272 మంది ఓటర్లు



తహసీల్దార్ వీవీ నాగరాజు

క్రోసూరు: ఈ నెల 27న జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల వివరాలు తహసీల్దార్ వీవీ నాగరాజు సోమవారం తెలిపారు. బెల్లంకొండ మండలంలో 611 మంది ఓటర్లు, అచ్చంపేట మండలం 1,481, క్రోసూరు 1,548, పెదకూరపాడు 1,305, అమరావతిలో 2,327 మంది ఓటర్లున్నారు. ఐదు మండలాల్లో కలిపి మొత్తం 7,272 మంది ఓటర్లున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ క్రోసూరు మండలంలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రోసూరులోని జెడ్పీ పాఠశాలలోని 340 బూత్ 757 ఓటర్లు, 341వ బూత్‌లో 791 ఓటర్లు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.


అడవి పందుల నుంచి పంటల రక్షణ ఇలా...



పంటలను రక్షించుకునేందుకు రైతులు అవలంభిస్తున్న విధానం

అచ్చంపేట: అడవి వెంబడి పొలాల్లో వేసిన కంది, పెసర, మొక్కజొన్న తదితర పంటలను అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు రైతులు వినూత్న పద్ధతులను అవలంభిస్తున్నారు. పంట పొలంలో రెండు ఎత్తైన పోల్స్ పాతి, పై భాగాన రెండు పోల్స్‌నూ కలుపుతూ అడ్డంగా మరో పోల్ కడతారు. దానికి మధ్యలో ఫొటోలో చూపించిన విధంగా రెండు ఖాళీ కూల్ డ్రింక్స్ బాటిల్స్‌ను వేలాడదీస్తారు. ఆ రెంటి మధ్యలో సీలాలకు తగిలే విధంగా రెండు చిన్న చిన్న గట్టి ఇనుపరాడ్‌లను తాడుతో కడతారు. వాటికి దిగువన మందపాటి అట్టలను కడతారు. గాలికి అట్టలు కదిలి మధ్యలో ఉన్న ఇనుపరాడ్‌లు ఖాళీ సీసాలకు కొట్టుకుంటాయి. అప్పుడు వచ్చే శబ్దానికి అడవి పందులు పరారవుతాయి. ఇలా పొలంలో అక్కడక్కడ ఏర్పాటు చేయడం ద్వారా అడవి పందుల నుంచి రక్షణ పొందుతారు. ఈ దృశ్యం చెరుకుంపాలెంలో అడవి వెంబడి పంట పొలాల్లో కనిపించింది.

శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ కరస్పాండెంట్‌గా సురేష్‌కుమార్



అమరావతి: అమరావతి పరిసర ప్రాంతాలలో సుమారు 75 సంవత్సరాలుగా విద్యార్థులకు సేవలు అందిస్తున్న శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ నూతన కరస్పాండెంట్‌గా అమరావతి గ్రామానికి చెందిన ఆళ్ళగడ్డ సురేష్ కుమార్ ఎంపికయ్యారు. పాఠశాల పాలక మండలి సభ్యులు ఏకగ్రీవంగా సురేష్‌కుమార్‌ను ప్రతిపాదించటంతో అయన సోమవారం కరస్పాండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత కరస్పాండెంట్ మల్లెల శ్రీనాథచౌదరి బాటలో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా తెలుగు,ఇంగ్లీష్ మీడియం ప్రధానోపాధ్యాయులు మాజేటి రాము, ముత్యాల శ్రీనివాసరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొల్లి లక్ష్మీనారాయణ, పాలక మండలి అధ్యక్షుడు వజినేపల్లి శేఖర్, సభ్యులు, ఉపాధ్యాయులు నూతన కరస్పాండెంట్ సురేష్‌కుమార్‌ను సన్మానించారు.